క్లుప్తంగా

యోగా పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ



పిడుగురాళ్ల: పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన 6వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా సేన స్పోర్ట్ చాంపియన్ షిప్ పోటీలలో తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారని ప్రిన్సిపాల్ పి.నరేష్ సోమవారం తెలిపారు. స్ప్రెయిన్ విభాగంలో 14–18 బాలుర విభాగంలో ఎల్.వెంకట కార్తిక్ రాష్ట్ర స్థాయిలో 2వ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించాడని చెప్పారు. అదే విధంగా యోగాలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన యోగా కోచ్ ఎం.శివనాయక్ 18–28 విభాగంలో ప్రథమ బహుమతి సాధించి గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరిని తిరుమల ఆక్స్‌ఫర్డ్ డైరెక్టర్ బొల్లా గిరిబాబు, ప్రిన్సిపాల్ పి.నరేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాచర్ల మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా జ్యోతి



మాచర్ల: మున్సిపల్ వైస్ చైర్మన్ కె.జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పురపాలక సంఘంలో సోమవారం స్పెషల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు. టీడీపీ నాయకులు మున్సిపల్ చైర్మన్ మదర్ సాహెబ్, వైస్ చైర్మన్ సిద్ధమ్మ, నాయకులు ఎనుమల కేశవరెడ్డి, వార్డు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ జ్యోతిని అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు గ్రామానికి చెందిన చిరుమామిళ్ల రామలక్ష్మయ్య మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా ప్లేట్లు గ్లాసులు సోమవారం పంపిణీ చేశారు. దాత 50 మంది విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం విలీనియం శౌరిబాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంగసపల్లి పుష్పలత పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

రెంటచింతల: రెంటాల ఆలయ భూములు ఆక్రమణ దారులకు నోటీసులిచ్చినట్లు ఈఓ రామిరెడ్డి తెలిపారు. సర్వే నెంబర్లు 211లో 20 మంది అక్రమంగా ఆక్రమించారని, వెంటనే ఖాళీ చేయాలని నోటీసుల్లో కోరారు. ఆలయ భూములు ఆక్రమించిన 13 మందికి కూడా నోటీసులిచ్చామన్నారు. మిట్టగుడిపాడు, రెంటచింతలలోని ఆలయాలకు చెందిన భూములను ఆక్రమించిన ఆక్రమణదారుల నుంచి కోర్టు అనుమతితో పోలీసుల రక్షణలో స్వాధీనపర్చుకోనున్నట్లు తెలిపారు. ఆక్రమణదారులు తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ మేరి కనకానికి వినతిపత్రం అందజేశారు.

కారెంపూడిలో వాహనాల తనిఖీలు

కారెంపూడి: మోటార్ వెహికల్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎంవీఐ ఎం.సురేష్ బాబు తనిఖీ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు. అలాగే టూ వీలర్లపై ఇద్దరి కంటే ఎక్కువ మందితో వెళ్లవద్దని ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని కోరారు. తనిఖీలలో ఆర్టీసీ అధికారి యజ్ఞయ్య పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతం పరిశీలన

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువను మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలను ఈ నెల 30 నుంచి నిమజ్జనం చేయనున్న దృష్ట్యా ఆ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా గుంటూరు బ్రాంచ్ కాలువను పరిశీలించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

మాచర్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లు గత కొన్ని సంవత్సరాలుగా అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం స్పందించాలని రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు అన్నారు. సోమవారం పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ హయాంలో పెన్షనర్లకు, ఉద్యోగులకు పీఆర్‌సీ పేరుతో నష్టం జరుగుతుందన్నారు. డీఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. ఇటీవల జేఏసీతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జరిపిన సమావేశంలోనూ పెన్షనర్లకు సంబంధించిన అనేక సమస్యలు చర్చకొచ్చాయన్నారు. హెల్త్‌కార్డులకు సంబంధించి మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకు సంబంధించి అనేక సమస్యలను వివరించారు. తాత్కాలిక అధ్యక్షులు వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతనంగా ఉద్యోగ విరమణ చేసిన సభ్యులు సంఘంలో చేరారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ గాలీబ్, సహాయ కార్యదర్శి గౌస్, సభ్యులు సుబ్బారావు, కిరీటిరెడ్డి, భాస్కర్‌బాబు, శివపార్వతి, నాగార్జునరాజు, కోటేశ్వరరావు, అంజయ్య, హరినాథ్, పాపిరెడ్డి, నరసయ్య, వెంకటేశ్వర్లు, చౌడయ్య, ఈశ్వరయ్య, మాబు, నారాయణ, జాన్ అహ్మద్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల షాపు తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసీల్దారు కిరణ్ కుమార్, వ్యవసాయ అధికారులు



ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు ఎరువుల షాపులలో వ్యవసాయాధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాధికారి కె.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎరువులను విచక్షణారహితంగా వాడకుండా వ్యవసాయాధికారుల సూచనలు మేరకు మాత్రమే ఎరువులను వాడాలని సూచించారు. పంట వేసిన ప్రతి రైతు మీ గ్రామాలలో రైతు సేవా కేంద్రాలకు, ఎరువులు సరఫరా చేయబడుతున్నాయన్నారు.

మాచర్ల: పట్టణంలో ఎరువుల దుకాణాలను తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, మాచర్ల మండల వ్యవసాయ అధికారి డి.పాప కుమారి సోమవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎరువుల నిల్వ, బ్యాలెన్సులను, స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ కాపీలు, బిల్ పుస్తకాలు పరిశీలించారు. ఎరువుల డీలర్లు అందరూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో మాచర్ల వ్యవసాయ విస్తరణ అధికారి మార్కండేయులు, ఎంపీఈఓ ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎంసీపీఐ నాయకులు

మాచర్ల రూరల్: కూటమి ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుందని, వారికి ప్రత్యామ్నాయంగా 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని ఎంసీపీఐ నాయకులు అబ్రహం లింకన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆటోడ్రైవర్లు ధర్నా నిర్వహించారు. మహిళలకు ఉచిత ప్రయాణం ఏర్పాటు వలన ఆటో డ్రైవర్ల జీవన పరిస్థితి ఆందోళనగా మారిందని, చాలీ చాలని బతుకులతో జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం ద్వారా మరింత ఆర్థికంగా దిగజారిపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బండ్ల మహేష్, వేముల వెంకట్రావు, ఎంసీపీఐ (యూ) నాయకులు మాచవరపు నాగేశ్వరరావు, ఆటో డ్రైవర్లు రంగస్వామి, బ్రహ్మాచారి, కోటా పాపిదానం, అశోక్, ముత్తయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కల్యాణ మండపంలో వినాయక చవితి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు కోట రమేష్‌బాబు మాట్లాడుతూ.. డిస్ట్రిక్టు గవర్నర్ కె.రాంప్రసాద్ సూచనల మేరకు 900 మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ పచ్చిపులుసు పాపయ్య గుప్తా, ట్రెజరర్ ఊటుకూరి గురునాథం, కనిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో దాచేపల్లి వాసుల ప్రతిభ

- ముగ్గురికి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు
- నిరుపేద కుటుంబం నుంచి ఉపాధ్యాయులుగా ఎదిగిన యువకులు



మందా సాగర్ బాబు



నాగెండ్ల రత్న కిషోర్



మీసాల రవి

దాచేపల్లి: కృషి.. పట్టుదల వీరిని అందలమెక్కించింది. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి నిరంతరం శ్రమిస్తూ కష్టపడి చదువుకొని ప్రభుత్వ కొలువులను సాధించారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో దాచేపల్లి వాసులను అదృష్టం వరించింది. నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగిన వీరంతా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన మందా సాగర్ బాబు, నగర పంచాయతీలోని ఇరికేపల్లికి చెందిన నాగేండ్ల రత్నం కిషోర్, ముత్యాలపాడుకు చెందిన మీసాల రవి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. సాగర్ బాబు 487 ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపిక కాగా, రత్న కిషోర్ 148 ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యారు. మీసాల రవి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లో 19వ ర్యాంకు, స్కూలు అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ జోనల్ స్థాయిలో 25 ర్యాంక్, పీఈటీగా జోనల్ స్థాయిలో 32 ర్యాంకు సాధించాడు.

తహసీల్దార్‌కు నూర్ బాషా సంఘం సన్మానం



తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను సన్మానిస్తున్న నూర్‌బాషా సంఘ నాయకులు

మాచర్ల రూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను అందిస్తూ విధి నిర్వాహణలో మంచి ప్రతిభ కనబరిచిన తహసీల్దార్ కిరణ్ కుమార్ సేవలు అందరికీ ఆదర్శమని నూర్ బాషా సంఘ నాయకులు కొనియాడారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉత్తమ అవార్డు అందుకున్న కిరణ్ కుమార్‌ను సన్మానించి వారు మాట్లాడారు. విధి నిర్వాహణలో ఆయన చూపుతున్న నిబద్ధత, పేదవారికి న్యాయం చేయాలనే ఆయన ఆలోచన విధానం ఎంతో గొప్పదన్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఖాసిం, అన్వర్, అక్తర్, నాసర్‌వలి, మౌలాలి, షేక్ సైదా, హుస్సేన్, బాదన్‌బాయి, ఇమాంసా, పల్నాడు టీవీ జాని పాల్గొన్నారు.

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

వెల్దుర్తి: గణేష్ ఉత్సవాల కోసం పర్మిషన్ తీసుకోవాలని వెల్దుర్తి ఎస్‌ఐ షేక్ సమందర్‌వలి పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, గురజాల డీఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్ గణేష్ ఉత్సవ్ నెట్‌ను ప్రారంభించిందన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లైయ్ చేసుకోవాలన్నారు. దీని వలన అన్నీ విభాగాలకు సమాచారం వెళ్తుందన్నారు. పోలీసులు తనిఖీ చేసిన తరువాతనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత మొబైల్ నంబర్‌తో లాగిన్ కావాలన్నారు. క్యూఆర్ కోడ్ తీసుకొని పందిరి వద్ద అతికించాలని కోరారు. విద్యుత్, ఇతర అనుమతులు ఆయా శాఖల నుంచి తీసుకోవాలని చెప్పారు. ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో మంచి వాతావరణంలో అన్నీ శాఖలకు సహకరించి గణేష్ ఉత్సవాలు విజయవంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచకుంటే ఆందోళన చేస్తాం

సీపీఎం జిల్లా నాయకుడు రవిబాబు



మాట్లాడుతున్న రవిబాబు

ఎర్రబాలెం(క్రోసూరు): ప్రభుత్వం రైతులకు యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచకుంటే ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వరి, పత్తి, మిరప పంటలు పండించే రైతులకు యూరియా చాలా అవసరమని ప్రస్తుతం యూరియా ధర అందుబాటులో లేకుండా పోయిందని 45 కిలోల యూరియా బస్తా ధర రూ.267.50కు ప్రభుత్వం రైతులకు అందించాల్సి ఉండగా మార్కెట్లో అదనంగా రూ.130–150 చెల్లించాల్సి వస్తుందని అన్నారు. రైతులకు అవగాహన కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం యూరియాకి ప్రత్యామ్నాయంగా నానో ఎరువుల్ని అందిస్తుందని, నానో ఎరువులు శాస్త్రీయంగా దిగుబడికి సహకరించడం లేదనే అభిప్రాయాన్ని కొన్ని యూనివర్సిటీలు చెబుతున్నాయని, దీంతో రైతులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. ఇప్పటికే గత ఏడాది పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్న రైతులకు ఎరువుల భారాన్ని రైతులపై వేయటం అన్యాయమని, యూరియా నిల్వలను గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్లు, సొసైటీలలో అందుబాటులో ఉంచాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం క్రోసూరు మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, మండల కమిటీ సభ్యులు రావెళ్ల వెంకటేశ్వర్లు, చిలక ఏషియా, ఏపూరి వెంకటేశ్వర్లు, అత్తోట బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్ పర్సన్‌గా భారతి బాధ్యతలు స్వీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి: నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్ పర్సన్‌గా దాచేపల్లి మాజీ సర్పంచి బెల్లంకొండ భారతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ యార్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు, చైర్ పర్సన్‌గా భారతి తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి, నాయకులు బెల్లంకొండ బద్రి, తోట వెంకటేశ్వర్లు, కర్నాటి వరలక్ష్మి, నర్రా పుల్లయ్య, తంగెళ్ల శ్రీనివాసరావు, షేక్ వలి, శ్రీరాములు, నారాయణ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ గురవయ్య సేవలు మరువలేనివి



ఆర్‌ఎంపీలను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైద్యులు కమలాసన్

మాచర్ల రూరల్: పల్నాటి ప్రాంతంలో ఆర్‌ఎంపీగా పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పల్లెటోయిన గురవయ్య అందించిన సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. సోమవారం గురవయ్య ప్రథమ వర్ధంతి నిర్వహించారు. మెడికల్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన సభలో ఆర్‌ఎంపీలు గాడిపర్తి వెంకటేశ్వర్లు, లక్కాకుల శ్రీనివాసరావులకు స్మారక అవార్డులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యర్రాకుల సిద్ధమ్మ, వైద్యులు కమలహాసన్, దాక్షాయని, మాజీ ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జింకల నాగేశ్వరరావు, న్యాయవాదులు కేశం శ్రీనివాసరావు, పేర్ల వెంకటేశ్వర్లు, రమేష్, పి.నరసింహారావు, కిరణ్ పాల్గొన్నారు.

పత్తిలో రసం పీల్చే పురుగులను అరికట్టండి



అమరావతి: ప్రస్తుతం పత్తి పైరును ఆశించే రసం పీల్చు పురుగుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి అరికట్టాలని ఏవో అహ్మద్ అన్నారు. సోమవారం ఆయన రసం పీల్చే పురుగులను గురించి వివరిస్తూ బీటీ పత్తిని రసం పీల్చే పురుగుల బారి నుంచి రక్షించుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. బీటీ పత్తికి రసం పీల్చే పురుగులను నిరోధించే శక్తి లేదు కాబట్టి అవి ఆశిస్తే వాటి నివారణకు అవసరాన్ని బట్టి లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్ల మోనోక్రొటోఫాస్, రెండు మిల్లీలీటర్ల మిథైల్ డెమటాన్, 0.4 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ 200 ఎస్ఎల్, 0.2 గ్రాముల ఎసిటామిప్రిడ్, 0.2 గ్రాముల థయోమిథాక్సామ్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఆటో డ్రైవర్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



డీటీ కొండారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎం అధ్యక్షుడు మస్తాన్‌వలి, ఆటో డ్రైవర్‌లు

నకరికల్లు: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు అన్యాయం చేసిందని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి మండిపడ్డారు. స్త్రీశక్తి పథకం అమలు చేసే క్రమంలో ఆటోడ్రైవర్‌లకు వచ్చే సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదంటూ ఆటోవర్కర్‌లు సోమవారం నిరసన వ్యక్తం చేసి, డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారికి మద్దతుగా నిలిచిన పీడీఎం అధ్యక్షుడు మస్తాన్‌వలి మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం అమలుతో ఆటోడ్రైవర్‌ల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. ఏరాజుకారోజు ఆటో తోలుకొని జీవించే డ్రైవర్‌లు, కార్మికుల ఉపాధిపై ప్రభావం పడిందన్నారు. బాడిగలు లేక రోజు గడవడం కష్టంగా మారిందన్నారు. ఆటోలు కొనేందుకు చేసిన అప్పుకు కిస్తీలు కట్టాలని, పెరిగిన నిత్యావసరాలు, ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు ఆర్థికంగా కుంగదీస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటోడ్రైవర్‌లను ఆదుకుంటామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు నాగుల్ మీరా, ఉపాధ్యక్షుడు షేక్ మునాఫ్, కార్యదర్శులు జానీ, నాగూర్‌వలి, సూర్తాని శ్రీను, బాబు, నాగుర్ తదితరులు పాల్గొన్నారు.

పాలవాయిలో పిచ్చికుక్క స్వైరవిహారం



తొడ భాగంలో కుక్క కరచిన గాట్లు



బాలిక చేతి పై కుక్క కొరికిన గాట్లు

రెంటచింతల: పాలువాయిలో సోమవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంతంలోని కుక్కలు విద్యార్థులకు తెగబడటంతో రేష్మా, షమీర్, సుభానిలకు గాయాలయ్యాయి. సుమారు 4గంటల సమయంలో విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో కుక్కలు వెంటబడి దాడిచేశాయి. షేక్ జానీబాషాకు చెందిన రెండు గేదెలను అదే శునకం కరవటంతో గ్రామస్తులు పలువురు కుక్కను చంపేశారు.

ఇరువురు యువకులపై పీడీ యాక్ట్

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన ఇరువురు యువకులను పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారిరువురి పై పీడీ యాక్ట్ కేసు నమోదు చేశారు. పట్టణంలోని రాజుల కాలనీకి చెందిన భోగ్యం నాగ శ్రీకాంత్, క్రిస్టియన్ పేటకు చెందిన యర్రసాని గోపిలపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి వారిని రాజమండ్రి సెంట్రల్ జైలులో అప్పగించారు.

'చలో విజయవాడ' పోస్టర్ల ఆవిష్కరణ



క్రోసూరు: పాత పెన్షన్ సాధన కొరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంఘం ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సెప్టెంబర్ 1వ తేదీన చేపట్టిన చలో విజయవాడ నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని ఆ సంఘం ప్రతినిధులు మండలంలోని పలు పాఠశాలల్లో పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలూరి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధన కలగా మిగిలిందని, దశాబ్దాలుగా శాంతియుత నిరసనలు, ర్యాలీలు చేస్తున్నారని అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. దానిలో భాగంగానే సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ విజయవాడలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ఈఏ సంఘం ప్రతినిధులు తూమాటి శరత్‌కుమార్, బోళ్ల నరసింహ రెడ్డి, చిలకా సురేష్ , కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వినాయక మండపాలు



గార్లపాడు సెంటర్‌లో రూపుదిద్దుకుంటున్న మండపం



అచ్చంపేటరోడ్డులో కోటమ్మ సత్రం వద్ద పూర్తయిన గణేష్ మండపం



నాగన్నకుంటలో నారికేళ గణపతి విగ్రహానికి మండపం

వినాయక చవితి పండుగను పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తారు. తొమ్మిది రోజులపాటు పందిళ్లలో స్వామి వద్ద పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆనందంగా గడుపుతారు. 27న వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలో భారీ మండపాల ఏర్పాటు మొదలైంది. ప్రధాన రోడ్లపైనే కాక వీధి కూడళ్లు, సందు, గొందుల్లో కూడా చవితి మండపాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. కొన్ని చోట్ల పందిళ్ల నిర్మాణం పూర్తి కాగా మరికొన్ని చోట్ల కొనసాగుతుంది. వాడవాడలా భారీ విగ్రహాలను ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. స్వామి వారిని నిలబెట్టేందుకు పీఠం, కర్రలు, టార్పాలిన్‌లతో టెంట్లు వేసి మండపాలను సిద్ధం చేశారు. వాటిని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరిస్తున్నారు.

– సత్తెనపల్లి

అనాథాశ్రమంలో వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధి వీరమ్మ కాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ అనాథపిల్లలు, వృద్ధుల ఆశ్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్ సోమవారం విద్యార్థులకు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ ఉన్నవారికి మందులను పంపిణీ చేశారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు, సీహెచ్‌వో ప్రియదర్శిని, ఏఎన్ఎమ్ శారద, ఆశా కార్యకర్తలు సుజాత, మరియమ్మ, మునిరాబేగం తదితరులు ఉన్నారు.